రూప్‌చంద్ అ'ధర'హో

- కిలో చేప రూ.125కు విక్రయం
- నాలుగు నెలల్లో రూ.25 వరకు పెంపు
- పట్టుబడుల్లో బిజీగా ఆక్వా రైతులు


కొమ్మరలో రూప్‌చంద్ పట్టుబడులు


కోల్‌కతాకు ఎగుమతికి ఐస్‌ప్యాక్ చేస్తున్న కూలీలు

నిడమర్రు: చేపల ధరలు గత నాలుగు నెలలుగా పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతయ్యే రూప్‌చంద్ ధర గత ఏడాదితో పోల్చితే రూ.45 పెరిగింది. గత ఏడాది శివరాత్రికి రూప్‌చంద్ ధర రూ.80 ఉండగా, ఈ ఏడాది శివరాత్రికి రూ.122 నుంచి రూ.125 వరకు క్రయి విక్రయాలు చేస్తున్నట్టు ట్రేడర్ ఆంజనేయులు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాల వరకు చేపల సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో శీలావతి, కట్ల, ఫంగస్, రూప్ చంద్ చేపల సాగు ఎక్కువగా సాగవుతోంది. రూప్‌చంద్ మాత్రమే పెంచుతున్న రైతులు పెరిగిన ధరల లాభాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుకు గిట్టుబాటు

సాధారణంగా కేజీ రూప్‌చంద్ పెంపకానికి అన్నీ ఖర్చులు కలుపుకుని రూ.90 నుంచి రూ.100 వరకు అవుతుంది. నేడు మార్కెట్‌లో రేటు పెరగడంతో రైతుకు కేజీ చేప ధర రూ.125 వరకు పలుకుతోంది. రూప్‌చంద్ సాగు తగ్గిన నేపథ్యంలో కొందరు ఎగుమతిదారులు రూ.127 వరకు కొంటున్నారు. దీంతో ఒక కేజీ చేపకు సుమారు రూ.27 నుంచి రూ.37 వరకు గిట్టుబాటవుతోంది. రూప్‌చంద్ కోల్‌కతాతోపాటు బెంగాల్‌లోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. దీంతో రైతులు రూప్‌చంద్ పట్టుబడులుపై దృష్టి పెట్టారు.

తగ్గిన సాగు

ఇటీవల నష్టాల భారంతో చేపల సాగు రైతులు చతికలపడ్డారు. రూప్‌చంద్ చెరువుల సాగు కూడా బాగా తగ్గింది. గత ఏడాది నష్టాలు రావడంతో నియోజకవర్గంలో రూప్‌చంద్ పెంచే రైతులు 30 శాతం వరకు తగ్గిపోయారు. సొంత ట్యాంకులున్న రైతులు చెరువులను అయినకాడికి లీజుకిచ్చి చేపల సాగు విరమించారు. జనవరి నుంచి మార్కెట్‌లో చేపల ధరలు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధరలు లభించడంతో పాతరోజులు వచ్చాయని ఆశపడుతున్నారు. ఎకరాకు రైతులు 10 వేలు నుంచి 6 వేలు వరకు రూప్‌చంద్ పిల్ల పెంచుతారు. మార్కెట్‌లో పోటీ నేపథ్యంలో మేత ధరలు కొంత మేర తగ్గడం, మార్కెట్‌ను శాసించే దళారులు తగ్గడంతో ధరలు పెరుగుదల నిలకడగా ఉందని రైతులు చెబుతున్నారు.

ఆశించిన స్థాయిని మించిన ధర



రూప్‌చంద్ ధరలు రైతులు ఆశించిన స్థాయి కంటే మెరుగ్గా ఉన్నాయి. ఇతర చేపల ధరలు పరిశీలిస్తే కిలో శీలావతి రూ.112, ఫంగస్ రూ.90, రెండు కిలోలు రూ.100 కొనుగోలు చేస్తున్నారు. ఈ చేపల ధరలతో పోల్చితే రూ.125 వరకు రూప్‌చంద్ కొంటున్నారు. – సంకు శ్రీనివాసరావు, రూప్‌చంద్ రైతు, బువ్వనపల్లి

పెరిగిన అమ్మకాలు



15 ఎకరాలు సాగు చేస్తున్నాను. పిల్ల వేసిన ఆరు నెలల్లో పంట చేతికి వస్తుంది. కిలో సైజ్ రూప్‌చంద్‌కు, 1200 గ్రాముల సైజ్ ధరకు ఒకటి లేదా రెండు రూపాయలు మాత్రమే వ్యత్యాసం. దీంతో కిలో సైజ్ వచ్చిన రూప్‌చంద్ రైతులు పట్టుబడులుకు సిద్ధమవుతున్నారు. – పూసల వెంకటేశ్వరరావు, రూప్‌చంద్ రైతు, చిలకంపాడు

క్లుప్తంగా

డిగ్రీ కాలేజీలో అకడమిక్ ఆడిట్


మాట్లాడుతున్న ఆడిట్ సలహాదారు మధు

గణపవరం: కాలేజీ విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి తెలిపారు. ఆడిట్ సభ్యులు కళాశాల రికార్డులు, కాలేజీ ప్రవేశాలు, నిధుల వినియోగం, తదితర అన్ని రకాల అకడమిక్ రికార్డులను పరిశీలించారని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారని తెలిపారు. కాలేజీ నిర్వహణ, బోధన, తదితర అంశాలపై పలు సూచనలు చేశారని వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ ఆడిట్ అడ్వయిజర్లు మధు, కృష్ణచైతన్య, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


నారాయణపురంలో ప్రారంభించిన చలివేంద్రం

ఉంగుటూరు: ఆటో వర్కర్స్ నారాయణపురం సెంటర్లోని గణపవరం రోడ్డులో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని సర్పంచ్ దిడ్ల అలకానంద శ్రీనివాస్‌లు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్, వార్డు మెంబరు అడపా శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


హెల్మెట్ ధారపై మాట్లాడుతున్న ఎస్సై శివాజీ

దెందులూరు: ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఆర్ శివాజీ సూచించారు. గురువారం రాత్రి సోమవరప్పాడు వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుంటే పెనాల్టీలు తప్పవని హెచ్చరించారు.

మొక్కలు నాటి, సంరక్షించాలి


మొక్క నాటుతున్న సీడీపీఓ రాజశేఖర్

దెందులూరు: కొవ్వలి గ్రామంలో కోడ్ నెంబర్–159 అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం 6వ రోజు పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీఓ సునీల్ రాజశేఖర్ మొక్క నాటారు. ప్రతి బిడ్డ పేరునా ఒక మొక్క నాటి, సంరక్షించాలని ఆయన సూచించారు. పోషణ వాటికల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు ఆరోగ్యం, పోషణ పొందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దేవి, సహాయకురాలు శ్రీదేవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పని వేళల్లో మార్పు

దెందులూరు: ఉపాధి హామీ పథకం పనివేళలు మారాయని ఏపీఓ దశరథ రాంజీ గురువారం తెలిపారు. ఎండలు మండిపోతుండడంతో ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు పనివేళలను మార్చినట్టు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు పనులు నిర్వహిస్తారని తెలిపారు.

గుడాలకు గౌరవ డాక్టరేట్

గణపవరం: సౌరవిద్యుత్ రంగంలో పునరుత్పాదకశక్తి, కృత్రిమ మేధస్సు వినియోగం అనే అంశంపై పరిశోధన చేసిన గణపవరానికి చెందిన గుడాల సత్యప్రతాప్‌కు లింకన్ విశ్వవిద్యాలయం (మలేషియా) గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. సత్యప్రతాప్ ఇటీవల మలేషియాలో డాక్టరేట్‌ను అందుకున్నారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు రంగానికి సంబంధించి గ్రీన్ టెక్నాలజీతో విద్యుత్ ఉత్పత్తిలో సామర్థ్యంలో విశ్వసనీయత స్థిరత్వం పెంచడానికి చేసిన పరిశోధనలకు గౌరవ డాక్టరేట్ లభించిందని సత్యప్రతాప్ తెలిపారు. తనకు సహకరించిన కిరీటి సేఫెస్ట్ టెక్నాలజీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువతకు హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి తెలిపారు. మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తామని, పదో తరగతి, ఆపైన చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులకు 15 వరకు గడువు ఉందని, పూర్తి వివరాలకు సెల్ 9493482414 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక తరగతుల సందర్శన


దెందులూరు: మంచి మార్కులతో విజయం సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. గురువారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

దంత సంరక్షణపై అవగాహన


దంత పరీక్ష చేస్తున్న డాక్టర్ అరవింద

దెందులూరు: చిగుళ్లు బలంగా ఉంటేనే పంటి సమస్యలు రావని స్థానిక సీహెచ్‌సీ డెంటల్ అరవింద అన్నారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో జాతీయ డెంటిస్ట్ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ అరవింద మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సాఫ్ట్ బ్రష్‌తో పళ్లు తోముకోవాలని, పచ్చి కూరగాయలు, గుడ్లు, తృణధాన్యాలు, మాంసకృతులు తీసుకోవాలని సూచించారు. పెద్దలు పిల్లలకు దంత సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల 40 సంవత్సరాలకే పళ్లు కదులుతున్నట్టు చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాటర్ లేని ఫౌంటెయిన్లు


జూట్ మిల్లు సెంటరులో వాటర్ ఫౌంటెయిన్

వైఎస్సార్ సీపీ హయాంలో సుందీరకరణలో భాగంగా ఏలూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో వాటర్ ఫౌంటెయిన్లు నిర్మించారు. వీటి ప్రారంభం ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటర్ ఫౌంటెయిన్లను ప్రారంభించింది. ఇవి విద్యుత్ కాంతుల్లో వాటర్ సౌండ్స్‌తో కళకళలాడేవి. అనంతరం అవి రెండు నెలల నుంచి కళతప్పి కనిపిస్తున్నాయి.
– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు


అశోక్‌నగర్ సెంటర్‌లో..


తంగెళ్లమూడి సెంటరులో..

11న చలో విజయవాడ

ఏలూరు (టూటౌన్): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు కోరారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఆయన గురువారం మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికులకు భద్రత కల్పించాలని, వేతనాలను మున్సిపల్ శాఖ నుండే చెల్లించాలని కోరారు. యూనియన్ నాయకులు కూనపాముల విగ్నేష్, భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల వితరణ

దెందులూరు: గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలకు 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.30 వేలు విలువ చేసే రెండు మైక్ సెట్‌లు, రెండు కార్డులెస్ ఫోన్లతోపాటు ఇతర పరికరాలను గురువారం హెచ్ఎం జి.మల్లికార్జునరావుకు అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్ఎంతోపాటు గ్రంథ పాలకుడు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి పల్లాలమ్మ ఉత్సవాలు


విద్యుత్ వెలుగుల్లో పల్లాలమ్మవారి ఆలయం

ఉంగుటూరు: రాచూరు పల్లాలమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ప్రాంతాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. శుక్రవారం పల్లాలమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈనెల 8న కుంకమ పూజలు, లింగార్చన, సూర్యనమస్కారాలు, 9న అష్టలక్ష్మి హోమం, 108 మంది మహిళలు కలశాభిషేకం, ఊరేగింపు నిర్వహిస్తారని ఉత్సవ కమిటీ కన్వీనర్ మందా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

8న మహిళా సాంస్కృతిక సమ్మేళనం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 8న మహిళా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీలు తెలిపాయి. ఈ మేరకు స్థానిక అన్నే భవనంలో బ్రోచర్, ఫ్లెక్సీలను గురువారం విడుదల చేశాయి. మధ్యాహ్నం 3 గంటలకు రామకృష్ణపురంలోని సాహిత్య మండలి భవనంలో మహిళలకు ప్రతిభా పోటీలు, చైతన్య సదస్సు, శ్రామిక మహిళలకు సత్కారాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నాయి.

సాగునీటి సరఫరాకు కమిటీలు


పాతూరు వద్ద పంట చేలను పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: గోదావరి కాల్వ నీటిని పంట చేలకు కాకుండా ఆక్వా చెరువులకు తరలిస్తే సహించేది లేదని తహసీల్దార్ బి.రమాదేవి హెచ్చరించారు. దాళ్వాకు సాగునీటి ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం గోదావరి కాల్వ వెంబడి భీమడోలు, పాతూరు వరకు నీటి తూములతోపాటు పంట చేలను ఆమె పరిశీలించారు. అనంతరం సాగునీటిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పంటకు సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కమిటీ సభ్యులు రాత్రి వేళల్లో గస్తీగా తిరుగుతారని తెలిపారు. తూముల వద్ద లీకేజీలుంటే వెంటనే ఇసుక బస్తాలను వేసి అరికట్టాలని, కాల్వ గట్టు, చానల్ వద్ద అక్రమంగా మోటార్లు పెడితే చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎస్సై వై.సుధాకర్, ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి, ఏఈ సుబ్రహ్మణ్యం, ఎఫ్‌డీఓ భవానీ, ఏఈ వి.శివాజీ, వీఆర్వోలు వినయ్, నీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోహన్‌రావు నియామకం కోర్టు ధిక్కారమే

భీమడోలు: హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ సహకార శాఖ ఉన్నతాధికారులు గుండుగొలను సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నంగెడ్ల వెంకట మోహన్‌రావును నియమించడంపై గుండుగొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు వగ్వాల భాస్కర్ జిల్లా సహకార అధికారికి గురువారం ఫిర్యాదు చేశారు. సొసైటీ కార్యదర్శిగా పని చేసిన కాలంలో లక్షలాది రూపాయల నిధులు దుర్వినియోగానికి, అవకతవకలకు పాల్పడడంతో వెంకట మోహనరావుపై చర్యలకు ఉపక్రమించారని, ఇలాంటి వ్యక్తిని పలుమార్లు సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించొద్దని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని వివరించారు. అయినా సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వి.పవన్ చక్రవర్తి ఏకపక్షంగా వెంకట మోహనరావును ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించారని తెలిపారు. ఆయన్ని తొలగించాలని, అదేవిధంగా గత ఆరు నెలల్లో గుండుగొలనులో రూ.5 లక్షలకు పైగా నగదు దుర్వినియోగంపై విచారణ చేయాలని భాస్కర్ కోరారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్ణయం వద్దు

ఏలూరు (టూటౌన్): స్థానిక గజ్జలవారి చెరువు వద్ద చేపలు, కూరగాయల మార్కెట్ వద్ద సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని బీఎస్పీ నాయకులు నేతల రమేష్ బాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. చేపల మార్కెట్‌లో ఒకటి, గజ్జలవారి చెరువు దక్షిణపు వైపు మరొకటి, మార్కెట్‌కు అత్యంత దగ్గరలో పెద్ద వంతెన పక్కనే ఇంకొక సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నట్టు తెలిపారు. ఇన్ని ఉండగా, మార్కెట్‌లో రాకపోకలు సాగించడానికి వాహనాలు నిలుపు కోవడానికి ఉపయోగపడే స్థలంలో మరో కాంప్లెక్స్ నిర్మాణంతో ఉపయోగం లేదన్నారు.

భీమడోలులో ట్రాఫికర్

- ఇరుకు రోడ్లు, ఆపై పార్కింగ్ కష్టాలు
- ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య జటిలం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- వైఎస్సార్ సీపీ హయాంలో పరిష్కారానికి చర్యలు


భీమడోలు సంతలో తప్పుకునేందుకు వీలులేని ప్రధాన రోడ్డు


భీమడోలులో నాబార్డ్ నిధులతో నిర్మించిన ఒక షెడ్డు

భీమడోలు: ఇరుకు రోడ్లు, ఆపై పార్కింగ్ సమస్యలతో భీమడోలులో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. స్థలాల ధరలు ఆకాశన్నంటడంతో రోడ్లు, డ్రెయినేజీలను సైతం ఆక్రమించి వాహనాల పార్కింగ్‌కు స్థలం వదలకుండా భవనాలను నిర్మించుకోవడం ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా మారింది. రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ భీమడోలు మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వైపు వెళ్లే ప్రధాన రహదారి ఆక్రమణలతో కుచించుకుపోయింది. బుధవారం వారపు సంతలోనూ రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన సమస్యలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేడు.

రద్దీగా సంత మార్కెట్ మార్గం

భీమడోలులో బుధవారం వారపు సంతకు 50 గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. తోపుడు బండ్లు, కూరగాయల తాత్కాలిక దుకాణాలు ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డుపైనే నిర్వహిస్తుంటారు. రహదారిపై రైతులు, వ్యాపారుల వాహనాలు గంటల కొద్దీ నిలిపి ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటారు. మరోవైపు వడ్లపట్ల వైపు మాంసం దుకాణాల ఏర్పాటుతో ఎదురెదురుగా ఒకరికొకరు తప్పుకునేందుకు అవకాశం ఉండదు. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలు, ఆర్టీసీ బస్సులు సంత మార్కెట్ మార్గంలోనే రాకపోకలు సాగించాలి. జాతీయ రహదారి భీమడోలు వద్ద రైల్వే గేటు వేసి తెరిస్తే వందలాది వాహనాలు ఒక్కసారిగా సంత మార్కెట్ మార్గంలోకి వస్తుంటాయి. దీంతో ఈ మార్గం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది.

వైఎస్సార్ సీపీ హయాంలో షెడ్ల నిర్మాణం

భీమడోలు సంత మార్గంలో ప్రజలు పడుతున్న కష్టాలను తీర్చేందుకు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ చొరవతో నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో రెండు షెడ్ల నిర్మాణానికి నాబార్డ్ నిధులు రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఒక షెడ్డు నిర్మించారు. మరో షెడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ షెడ్లు అందుబాటులోకి వస్తే కొంత సమస్య తీరనుంది.

జాతరకు వేలాదిగా వాహనాలు


రైలు వెళ్తుంటే భీమడోలు వైపుగా నిలిచిన వాహనాలు

12 ఏళ్లకు ఒకసారి వచ్చే భీమడోలు గ్రామ దేవతలు మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల నెల రోజుల జాతర ఉత్సవాలు ఈ నెల 8, 9వ తేదీల్లో ముగియనున్నాయి. ఈ రెండు రోజుల్లో గ్రామానికి వివిధ రాష్ట్రాల్లో ఉన్న బంధువులు రానున్నారు. గ్రామంలో 2.5 లక్షల వరకు జనం వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వేలాదిగా వచ్చే వాహనాలను ప్రైవేటు స్థలాల్లో భద్రపర్చుకోవాలని జాతర కమిటీ సూచిస్తోంది. భీమడోలు రైల్వే గేటు నుంచి గణపతి సెంటర్ మీదుగా సంత మార్కెట్ వద్ద గల అమ్మవార్ల ఆలయాల వరకు ఉన్న ఆక్రమణలను తొలగించాలని, దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించాలని కొందరు పెద్దలు జాతర ఉత్సవాల ప్రారంభంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

పంచాయతీ ప్రత్యేక దృష్టి



భీమడోలు సంత మార్కెట్, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సంత మార్కెట్ కార్యకలాపాలపై పంచాయతీ ప్రత్యేక దృష్టి సారించింది. ఏన్నో ఏళ్లుగా రోడ్డుపై సాగుతున్న సంతను వారికి కేటాయించిన లోపల వైపుకు మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నాబార్డ్ నిధులతో చేపట్టిన రెండు షెడ్లు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరనుంది. గ్రామీణ ప్రాంత రైతులు, వినియోగదారులకు ఈ షెడ్లు వద్ద ప్రయోజనం చేకూరుతుంది.
– పాము సునీతామాన్‌సింగ్, సర్పంచ్, భీమడోలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



సంత మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ఎక్కువ వాహనాలు నిలవకుండా అవగాహన కల్పిస్తున్నాం. సంత మార్కెట్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని చెబుతున్నాం. జాతరకు వచ్చే వేలాది వాహనాలన్నీ ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ చేసుకునేలా నిర్ణయించాం. మైక్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాం. జాతరను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు, పంచాయతీలకు ప్రజలు సహకరించాలి.
– వై.సుధాకర్, ఎస్సై, భీమడోలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దెందులూరు: గాలాయగూడెం సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గోపన్నపాలెం, గాలాయగూడెం, సానిగూడెం, కొత్తపల్లి, చల్లపల్లి, వేగవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.

పూళ్ల పరిసర గ్రామాల్లో..

భీమడోలు: పూళ్ల సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో లైన్ల నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. పూళ్ల ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు.